

మంత్రికి గౌరవ వందనం చేస్తున్న క్రీడాకారులు

## క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

**రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల, గనుల శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి**

పూడూరు, అక్టోబర్ 3 : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల, గనుల శాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అండర్ 14, 17వయస్సు విద్యార్థిని, విద్యార్థులు జిల్లాలోని 18 మండలాలకు చెందిన24 టీంలు 320 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మంగళవారం పూడూరు మండలం మోడల్ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన 67వ జిల్లాస్థాయి బాల బాలికల స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులు ప్రతిభను చాటుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. అర్జున అవార్డు గ్రహీతలు రవికాంత్‌రెడ్డి, సుహాసిని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాకు చెందినవారేనని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని మంత్రి సూచించారు. తెలంగాణ ప్రతి కీడాకారుడి అభ్యున్నతికి ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. అనంతరం వాలీబాల్ క్రీడలను జిల్లాలోని ఆరు జోన్లకు సంబంధించిన వ్యాయామ ఉపాధ్యాయులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి క్రీడలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనజావేణుగోపాల్, ఎంపీటీసీ సురేందర్, జిల్లా విద్యాధికారి రేణుకదేవి, ఎంఈవో హరిచ్చంద్ర, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎస్‌జీఎఫ్‌ఐ నర్సింహులు, పీఈటీ వెంకటయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హ్యాట్రిక్ పక్కా

**కాంగ్రెస్ నేతలను ప్రజలు నమ్మరు**

**బీఆర్ఎస్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమానికిప్రజల మద్దతు**

**మంత్రి మహేందర్‌రెడ్డి**

కొడంగల్, అక్టోబర్ 3 : సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసి నిధులు మంజూరు చేస్తున్నారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, సమాచార శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొడంగల్ మండలంలోని రుద్రారంలో రూ.3.50 కోట్లతో నిర్మించే 33/11 కేవీ సబ్ స్టేషన్, రూ.20 లక్షలతో నిర్మించే చర్చి, రూ.5 లక్షలతో నిర్మించే స్మశాన వాటిక ప్రహరీ, మైనార్టీల కమ్యూనిటీ హాల్, రూ.2.70 కోట్లతో పాటిమీదిపల్లి నుంచి రుద్రారం వరకు నిర్మించే బీటీరోడ్డు, రూ.20 లక్షలతో నిర్మించే పాటిమీదిపల్లి జీపీ భవనానికి శంకుస్థాపన చేసి, రుద్రారం నుంచి నాగారం వరకు రూ.60 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు, అన్నారంలో రూ.20 లక్షలతో నిర్మించిన జీపీ భవనాన్ని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సభల్లో మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం వైపే ఉన్నారని తెలిపారు. అమలుకు సాధ్యం కానీ హామీలు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తామంటే ఎలా నమ్ముతారని మంత్రి ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల గ్రామాలకు వెళ్లాలంటే రోడ్లు సక్రమంగా ఉండేవి కావని, తెలంగాణ వచ్చిన సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసి నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. కుల వృత్తుల జీవనోపాధికి అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గత పాలకుల హయాంలో వైద్య విద్య చదవాలంటే పేద విద్యార్థులకు అందని ద్రాక్ష గానే ఉండేదని, కేంద్రం సహకరించకున్నా.., సీఎం కేసీఆర్ జిల్లాకు ఒక వైద్య కళాశాలను మంజూరు చేయించి పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేశారని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్యను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో గురుకుల పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, వీటిలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి, విద్యను అందిస్తున్నామని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. కొడంగల్ అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించడే లక్ష్యంగా ప్రతి పల్లెకు బస్సులు నడుపుతున్నామన్నారు. తాండూరుకు వెళ్లే విధంగా జుంటుపల్లి రోడ్డు నిర్మాణం చేపడుతామని మంత్రి మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు.

**అభివృద్ధిలో కొడంగల్‌ను అగ్రగామి చేస్తా**

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించానని అన్నారు. రైతుబంధు పథకం ద్వారా రూ.1045 కోట్ల పెట్టుబడి సహాయం అందించామని, రైతు బీమా ద్వారా 1650 మందికి రూ.83 కోట్ల ఆర్థికంగా ఆదుకున్నట్లు తెలిపారు. కళ్యాణలక్ష్మి ద్వారా 9 వేల మందికి రూ.58 కోట్లు, షాదీముబారక్ ద్వారా 992 మందికి రూ.5.64 కోట్లు అందించామని, 37 వేల మందికి ప్రతినెలా ఆసరా పింఛన్ల ద్వారా రూ.9 కోట్లు అందజేస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. పదేండ్లు ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి కొడంగల్ అభివృద్ధిని, ప్రజల బాగోగులను గాలికి వదిలి రాజధానికే పరిమితమయ్యారని, ఎన్నికలు వస్తున్నందున ప్రజల ముందుకు వస్తున్నాడని ఎద్దేవా చేశారు. భవిష్యత్‌లో కొడంగల్‌ను మరింత అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు బస్వరాజ్, సర్పంచ్‌లు వెంకటలక్ష్మి, అనిత ఫకీరప్ప, నర్సింహులు, బాలమణి, గుండప్ప, కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, పార్టీ నాయకులు ఎంపీడీవో పాండు పాల్గొన్నారు.

**మంత్రికి ఘన స్వాగతం**

మంత్రి మహేందర్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్లతో ర్యాలీలు నిర్వహించారు.



మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

# సీఎంకేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి

**పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

**కేశంపేట మండలంలో అభివృద్ధి పనులు ప్రారంభం**


కేశంపేట, అక్టోబర్ 3: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కేశంపేట మండలంలోని సంగెం, అల్వాల గ్రామాల్లో 30 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శిలాఫలకాలను ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రాభివృద్ధికి పేదల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలను ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి, ఎమ్మెల్యేలను స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

**ఎమ్మెల్యే అంజన్న కార్యసాధకుడు**


షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ నిరంతరం అభివృద్ధికి తపించే కార్యసాధకుడని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధికి అత్యధిక నిధులు తీసుకువచ్చిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.

**గోపాల్‌రెడ్డి సేవలు అభినందనీయుడు**

కేశంపేట మండలంతో పాటు పలు ప్రాంతాల్లో నిరుపేదలకు సేవలందిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఎన్నం గోపాల్‌రెడ్డి అభినందనీయుడని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కొనియాడారు. సుమారు 20 ఏండ్ల కింద చనిపోయిన తన చిన్న కుమారుడు ప్రసూన్‌రెడ్డి జయంతి, వర్ధంతి రోజుల్లో ప్రతి సంవత్సరం పేదలకు అన్నదానం, తదితర సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా గోపాల్‌రెడ్డి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, పేదలకు ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదుకుంటారని కొనియాడారు. ఈ సందర్భంగా మహిళలకు గోపాల్‌రెడ్డి–సుకన్య కుటుంబసభ్యులు చీరలను మంత్రి, ఎమ్మెల్యేలతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, షాద్‌నగర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నటరాజన్, సర్పంచ్‌లు రేణుక, శ్రీలత, నవీన్ కుమార్, జగన్‌నాయక్, కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్, యాదగిరిరావు, విశ్వనాథం, వెంకన్నయాదవ్, పర్వత్‌రెడ్డి, వేణుగోపాలాచారి, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, తిరుమలరెడ్డి శ్రీనివాస్, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, ఫకీరయ్యగౌడ్, యాదగిరిగౌడ్, ప్రేమ్‌కుమార్‌గౌడ్, శ్రీశైలం, వెంకటేశ్, మురళీమోహన్, యాదగిరియాదవ్‌లతో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న లష్కర్‌గూడ పలుపార్టీల నాయకులు

# కాంగ్రెస్‌వి మోసపూరిత మాటలు

**ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

**బీఆర్ఎస్‌లో చేరిన లష్కర్‌గూడ, కేసీతండా పలుపార్టీల నాయకులు, కార్యకర్తలు..**

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 3 : కాంగ్రెస్‌పార్టీ నాయకులు అధికారంకోసం మోసపూరిత మాటలు చెబుతున్నారని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ నుంచి 60మంది, యాచారం మండలం కేసీతండా నుంచి 30మంది కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యాభై ఏండ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధిలో పూర్తిగా కుంటుపడిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి సాధించిందన్నారు. మరోమారు ఎన్నికలు రాగానే కాంగ్రెస్‌పార్టీ నాయకులు అధికారంకోసం మోసపూరిత మాటలు చెబుతున్నారని, వాటిని ప్రజలు నమ్మేస్థితిలో లేరని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యాచారం మండలం అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్‌నాయక్, లష్కర్‌గూడ ఎంపీటీసీ సాయిగౌడ్, సర్పంచ్ పారిజాత శేఖర్, పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కిషన్‌గౌడ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మంచాల, మేడిపల్లి వివిధ గ్రామాలకు చెందిన అనేక కుల సంఘాల నాయకులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి తమ మద్దతును ప్రకటించారు.

**తుర్కయాంజాల్ మున్సిపాలిటీకి రూ. 15కోట్లు మంజూరు..**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.15కోట్లు మంజూరు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర ఐటీపురపాలకశాఖమంత్రి కల్వకుంట్ల తారకరామారావుతో చర్చించి మంజూరు చేయించినట్లు తెలిపారు. రాష్ట్ర పట్టణ మౌలిక వసతుల కల్పన అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా ఈ నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో అనేక కాలనీలు వెలుస్తున్నాయని, వీటి అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి, తుర్కయాంజాల్, ఇంజాపూర్, ఉమర్ఖాన్‌గూడ, తొర్రూరు, కోహెడ, మునుగనూరు గ్రామాల్లో 42 అభివృద్ధి పనులకు ఈ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.